# కోర్టుకి రాని సాక్షులు

ఆశ్చర్యం !

జడ్జీగారికి చెప్పలేనంత ఆశ్చర్యంగా ఉంది.

"అది నా భార్య

అగ్నిసాక్షిగా పెళ్ళాడాను దాన్ని.

అది నా దగ్గరికి రావాలి.

నాతో ఉండాలి"

అంటాడు ఒక ఆసామీ.

అదీ అతని కేసు.

అతనే వాది ఆ కేసులో.

నల్లగా, పల్చగా, పొడుగ్గా ఉన్నాడతను.

నల్లగా, పొడవుగా, పీచురేగిన జుట్టు అతనిది.

నల్లగా, సన్నగా, పొడవైన మీసాలు అతనివి.

నడివయసులో బలిష్ఠంగా ఉన్నాడతను.

పుట్టింది లగాయితు నేటి వరకూ నవ్వినట్టులేని ముఖం అతన్ది.

పైన వేసుకున్నది ఏ రంగో తెలియని షర్టు.

కాళ్ళమీద జీరాడుతున్నది మాసిన పైజామా.

"నేను వాణ్ని పెళ్ళాడలేదు.

నేను వాడి పెళ్ళాన్ని కాను.

వాడెవడో నాకు తెలియదు.

నేను వాడి దగ్గరకి వెళ్ళనవసరం లేదు.

వెళ్ళను."

అంటుంది ఆమె.

అదీ ఆమె జవాబు.

ఆవిడే ప్రతివాది ఆ కేసులో.

తెల్లగా, లావుగా, పొట్టిగా ఉన్నదావిడ.

యవ్వనంతో, అందంతో పొంగ రెక్కిన ముఖం ఆమెది.

నల్లగా వంకులు తిరిగినది ఆమె జుట్టు.

కట్టుకున్నది తెల్లటి చీర.

వేసుకున్నది నల్లటి రవిక.

కొప్పులో పెట్టుకున్నది మందార పువ్వు.

వాది ప్రతివాదులిద్దరూ చెరో వైపూ నిలుచున్నారు.

అందరికీ ఎడంగా, హాలుకి ఒక చివరగా, రెండు గుమ్మాలకీ మధ్యగా, పిడకల కుప్ప ఎక్కిన ఇంటి అల్లుడిలా, ఎత్తుగా డయస్ ఎక్కి కుర్చీలో కూర్చున్నారే, వారే జడ్జీగారు.

"ఎందుకు పెళ్ళాడానా దీన్ని" అని వాపోతూ ఉంటారు జడ్జీగారు తన భార్య తలపుకి వచ్చినప్పుడల్లా. ఆవిడ ఎప్పుడూ తలపుకి వస్తూనే ఉంటుందాయనకి. "పెళ్ళాడకపోతే ఎంత బావుండును. ఎంత హాయిగా ఉండే వాణ్ని" అని విలపిస్తూ ఉంటాడాయన. పెళ్ళాం అనే పీడ ఎంత వేగిరం వదిల్తే అంత మంచిదనే నిశ్చితాభిప్రాయానికి ఆయన చాలా కాలం క్రితం వచ్చారు. వచ్చేట్టు చేసింది ఆయన భార్య. ఇప్పటికీ ఆ అభిప్రాయమే జడ్జీగారిది.

రానంటూన్న సైతాన్ని రాకపోతే వీల్లేదనే వాదిని చూసి మెంటల్‌గా ముక్కుమీద వేలేసుకున్నారు జడ్జీగారు.

"రాను మొర్రో అంటూ ఉంటే దాన్ని రమ్మంటావేమిట్రా ?" అని వాదిని అడిగాడు కూడాను.

"అగ్ని సాక్షిగా కట్టుకున్నది రాకేం చేస్తుందండి" అన్నాడు వాడు.

"రాకపోతే పోతుంది. నీ కెందుకా బాధ ?" అన్నారు జడ్జీగారు విసుక్కొని.

"నాకొక్కకపోతే బాధ మరెవరికండి ? అగ్నిసాక్షిగా నాచేత పుస్తె కట్టించుకున్న ముండా కూతురు రానని కూర్చుందాయెను. రాకపోతే ఏం

పోయిందని తమరు సెలవిస్తున్నారాయెను, తమరేలాగైనా సెలవిస్తారు. తమరి సొమ్మేం పోయిందండి..."

అని కేకలు వేసే వాదిని

"తగ్గవోయ్ తగ్గు. ఇదేం నీ యిల్లనుకున్నావా, కోర్టనుకున్నావా? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసుకున్నావా?" అంటూ హెచ్చరించాడు బెంచి గుమాస్తా.

అంతవరకూ నవ్వుతూ హుషార్‌గా చూస్తూ కూర్చున్న వాది వకీలు అప్పుడు కొంచెం తెలివి తెచ్చుకుని "నువ్వు నోరు ముయ్యరా" అంటూ వాడిని కసిరేడు.

వరండాలో జవాను "సైలెన్స్ సైలెన్స్" అని అరిచాడు.

ఒక్క క్షణం ఆగాడు వాది. ఆగి తిరిగి ఆరంభించబోయాడేదో, కాని ఈ లోపున అందుకుంది ప్రతివాది.

"బాబూ తమరాలకిస్తున్నారా, ముండాకూతురని ఎలా తిడుతున్నాడో? చచ్చినాడా, ఎవడ్రా నువ్వు? ఎవతైనా ముండ చేస్తావూ? వాళ్ళ పీకింబేపోతే చూసుకోరా..." అంటూ చాలా జోర్ చేసింది ప్రతివాది. ("చచ్చినాడా" వగైరా మాటలు కోర్టువార్ని అన్నవి కావు. వాది గురించి చెప్పినవి)

"ఆగవమ్మా ఆగు" అంటూ గాభరాపడి కేక వేశాడు బెంచి గుమాస్తా.

"మొగాడివైతే వాణ్ని అదమాయించవయ్యా, ఆడదానిమీద కేక లేస్తున్నావు, వాడంపర్ని ముండల్ని చేసి తిడుతూవుంటే అప్పుడు నీ నోరు ఏమయిపోయింది. చప్పుండా ఏమిటి? చాల్చాలు, గొప్ప మొగాడివి" అని చీవాట్లు పెట్టింది బెంచి గుమాస్తాని ప్రతివాది.

వాది తిట్టిన తిట్టుగురించి జడ్జీగారు మాత్రం "ఆహా! ఎంత ముచ్చటగా తిట్టాడు!" అని మనసులో అనుకుని చాలా మురిసిపోయారు. ఒక్కసారి ముచ్చటకైనా తిట్టలేదు జడ్జీగారు తన భార్యని నేటివరకూ.

ఈ లోపున,

"ఇది చాలా ఘోరం. చాలా అన్యాయం. మిక్కిలి దౌర్జన్యం. కోర్టువారు ఇలా ఊరుకోడం ఎంతమాత్రం భావ్యం కాదు. ఆడదాన్ని, ఇలా పలుగుల్లో, కోర్టులో జడ్జీగారి ముందు ఇలా తిట్టడమా! వాది దుర్మార్గాన్ని

కోర్టువారు ఎంతమాత్రం సహించకూడదు. కోర్టువారు వాదిని..." అని హఠాత్తుగా లేచి ఏమేమో చెప్పి ఇంకా ఏదో చెప్పబోతూన్న ప్రతివాది వకీల్ని ప్రతివాది టక్కున ఆపేసి అతనివైపు చురచురా చూసి "ఎందుకయ్యా ఇంతసేపూ వాడలా తిడుతూ ఉంటే ముంగిలా కూర్చొని చూస్తున్నావు? ఇప్పుడా వచ్చింది తెలివి?" అని సంజాయిషీ అడిగి వకీల్ గారి తెలివితేటల మీద కామెంట్ చేసింది.

అందుగురించి మిగతా లాయర్లెవరూ ఫ్రాండ్ అవలేదు. పైగా మిక్కిలి హెచ్చుగా సంతోషించేరు. సహజశత్రువుల్లో ఒకడైనట్టి వకీల్ని పార్టీతే చిన్నబుచ్చడం జడ్జీగారికి పరమానందప్రాయమయింది. ప్లీడరు గుమాస్తాలూ, ప్రేక్షకులూ were having the time of their lives.

మొత్తానికి, ప్రతివాదీ, ఆమె వకీలూ తప్ప మిగతా అంతా సంతోషించేరు. సదరు సందర్భంలో పైన చెప్పిన ప్రతివాది మిక్కిలి కినుకవహించి "ఓ! ఏం నవ్వుతున్నారయ్యా అంతానూ! మీ ఆడవాళ్ళనే అలా తిడితే ఇలానే నవ్వుతారు కాబోలు. నవ్వడం, కాదు బాబూ, ఇక్కడెవడైనా మొగాడన్నవాడుంటే వాడికి చర్మాలెగకొట్టండి. అప్పుడు మీ మగతనానికి నేకూడా సంతోషించి నవ్వుతాను" అని అందర్నీ మందలించి, ప్రోత్సహించి, ఛాలెంజి చేసింది.

వాడికి చర్మాలెగరగొట్టి, ఆ విధంగా తమ మగతనం నిరూపించుకొందికి కోర్టు గుమాస్తాలందిట్లో ఏ ఒక్కడూకూడా సిద్ధపడలేదు. పైపెచ్చు ఆడమనిషినే కూకలేసేరు.

దాన్తో ఆవిడ రాగాలు మొదలుపెట్టింది.

అవిడ ఏడుపుకి కోర్టుహాలు దద్దరిల్లింది.

అందుమీదట జడ్జీగారు చాలా కంగారుపడ్డారు. ప్లీడర్లెవరూ కంగారు పడలేదు. కోర్టంతా కంగాళీగా తయారయినందుకు ప్లీడరుగుమాస్తాలు తెగ సంతోషించేరు. అంతాకూడా గందరగోళంగా గోల్ మాల్ గా తయారయింది.

"Under these circumstances I pray for an adjournment" అన్నాడు ప్రతివాది వకీలు.

వీల్లేదన్నాడు వాది వకీలు.

వీలవుతుందన్నారు జడ్జీగారు.

ఆ నాటికి ఆ కేసు ఖాయంగా తేల్చేసి "అమ్మయ్యా" అనుకున్నారు జడ్జీగారు. పదే పదే వాయిదాలు పడితే కొంతమంది పార్టీలు ఖర్చులు భరించలేక రాజీ చేసుకుంటారని జడ్జీగారికి తెలుసు. ఈ కేసులో ఆ విధంగా జరుగుతుందేమోనని ఆశించారు కూడా. కాని, పెళ్ళాంకోసం కోర్టుని పట్టుక్కూర్చున్న వాడి మిక్కిలి మొండిఘటం అవడంచేత కాబోలు "దీని అంతేదో చూసెయ్యా" లన్నట్టుగా కోర్టుని పట్టుకుని ససేమిరా వదల్లేదు. పార్టీలు, ప్లీడర్లు, గుమాస్తాలు, సాక్షులు, మద్దతుదార్లు వగైరాలు, మొదలైనవారు, ఆసక్తిగలవారు, అంతా, యావన్మందీ కోర్టుకి వచ్చివచ్చి, ఇంటికి పోయి పోయి, తిరగ్గా తిరగ్గా ఆఖరికి, చివరికి, కొసాకి ఎలాగయితే నేం కేసు విచారణకి వచ్చింది.

వాదిగారు బోనెక్కేరు. ప్రమాణం చేసేరు. సాక్ష్యం చెప్పేరు.

వాది ఈ ప్రతివాదిని అగ్నిసాక్షిగా పెళ్ళాడేట్ట. పెళ్ళి యధావిధిగా, శాస్త్రోక్తంగా జరిగిందట. అప్పుడు చాలామంది వచ్చి, చూసి, సంతోషించేసి వెళ్ళిపోయారట. పెండ్లికొమార్తెకి చాలా అలంకారాలు పెట్టేట్ట, కాని వాటిగురించి ఈ కేసులో తగవు చెయ్యడం లేదట. తానయి కాణీ కట్నం పుచ్చుకోలేదట. ప్రతివాదీ తనూ కొన్నాళ్ళపాటు హాయిగా కాపురం చేశారట. కాపురం చేసేటప్పుడు ఫలానావారింట్లో అద్దెకుండేవారట. తరువాత అకారణంగా ప్రతివాది తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిందట. ఆవిడ ఇప్పుడు తన దగ్గరకి వచ్చి తీరవలసిందేనట. అందుకేనట ఈ కేసు.

మొత్తంమీద సాక్ష్యం మంచి కట్టుదిట్టంగా చెప్పేడు వాది. క్రాసులో వచ్చిన కొంతతిరుగుడు ప్రశ్నలకి టకాటక్కీమని టపీటపీమని ధాటీగా, ముక్తసరిగా, దొరక్కుండా జవాబు లిచ్చేసి చాలామందిచేత "శాబాస్" అనిపించుకున్నాడు.

తరువాత వరసగా, పెళ్ళిచేయించానసే పౌరోహిత్యుడూ, పెండ్లి, కార్యం చూశామనే పెద్దమనుష్యులూ, వాది ప్రతివాదులు తన ఇంట్లో కాపురం చేసేవారని చెప్పే పెద్దమనిషీ వగైరా వారంతాకూడా సాక్ష్యం చెప్పేరు. వాళ్ళల్లో ఏ ఒక్కడూకూడా తొణకలేదు. బెణకలేదు. తొట్రుపాటు పడ్లేదు. ప్లీడర్ల సమస్య లేదు.

వాది తరఫున సాక్ష్యం పూర్తయాక ప్రతివాది బోనెక్కి సాక్ష్యం చెప్పింది.

వాది తరఫున వచ్చిన సాక్షుల సాక్షిగాగాని, మరే దేవత దయ సాక్షిగాగాని తనకి ఈ వాడితోగాని మరెవరితోగాని పెళ్ళికాలేదట. ఆమెకి పెళ్ళి కాలేదట. వాడిని తానెప్పుడూ ఎరగనే ఎరగనట, వాణ్ణి యీ కేసులో తప్ప యింతకుముందెప్పుడూ చూడనే చూడలేదట, వాడితో తనెప్పుడూ కాపురం చెయ్యనేలేదట. తను ఫలానా ఫలానా సావుకారుగారి ఆడాళ్లో ఉన్నదట.

తక్కిన డిఫెన్సు సాక్షులు చెప్పేదేమంటే;

వారు ప్రతివాదిని చిన్నప్పటినుంచీ ఎరుగుదురు. ఆవిడకి ఎన్నడూ ఎవరితోనూ "పెండ్లి జరుగలేదు" పెళ్ళి కావాల్సిన అవసరం ఆవిడకి లేదు. ఆవిడకి ఈడు వచ్చినప్పట్నించీ, అంటే సుమారు మూడు సంవత్సరాలనుంచీ, ఫలానా ఫలానా సావుకారుగారు ఆవిణ్ని ఉంచుకున్నారు. సావుకారు పోషణలో కులాసాగా కాలం గడుపుతూన్న ప్రతివాదికి, ఫ్లాట్లకి టికాణా ఉన్నట్టు కనిపించని వాదిని పెళ్లాడవలసిన అవసరంలేదు. ఆవిడ గర్భం దాల్చడం సావుకారుగారి "అనుభవం"లో ఉండగానే జరిగింది. ఇటీవల ఆమె ఒక కుమారునికూడా కన్నది. ఈ రీతిగా నడిచింది ప్రతివాది తరఫు సాక్ష్యం.

అయితే ఫలానా ఫలానా సావుకారుగార్ని ప్రతివాది తన తరఫున సాక్షిగా ఎందుకు రప్పించలేదు ?

సావుకారుగారు "యూరోప్" వెళ్ళేరట. అక్కణ్ణించి "యూయస్ యే" వెళ్తారట. ఎప్పుడు వస్తారో తెలియదట. ఆయన్ని కమీషన్ మీద విచారణ చేయించడానికి కావలసినంత డబ్బు ప్రతివాది దగ్గర లేదట.

కోర్టువారు కేసుల్లో తీర్పులివ్వగలరు కాని పార్టీలకి డబ్బివ్వలేరే! పోనీ ఆ ముఖ్యమైన సాక్షి వచ్చేదాకా కోర్టువారు ఆగకూడదా? అసందర్భం. ఎన్నాళ్ళని ఆగడం. ఆగినా, అతగాడు ఈ దేశం రాకపోతే ?

అందుచేత ఫలానాఫలానా సావుకారుగారికోసం కనిపెట్టుకోకుండా కోర్టువారు దావా విచారణ చేసేరు. సాక్ష్యం విన్నారు. ఆర్గ్యుమెంట్లు విన్నారు. తదుపరి తీరుబడిగా తీర్పు చెప్పేరు. కోర్టువారు సుదీర్ఘంగా చెప్పిన తీర్పులో తెలుసుకోవల్సిన ముఖ్యవిషయాలివి :—

"కేసు ! ప్రతివాది తనభార్య అనిన్నీ, దావా తేదీకి నెలదినముల ముందు ఆమె తనని అకారణంగా విడిచిపెట్టి వెళ్ళిపోయినదనిన్నీ, ఆమె తన

వద్దకు రావలసియున్నదనిన్ని, అందుచేత ప్రతివాది తనభార్య అనే డిక్లరేషను నిమిత్తమున్ను, ఆమె తనవద్దకు వచ్చే నిమిత్తమున్ను వాది ఈ దావా తెచ్చియున్నాడు.

తను వాడినిగాని మరెవ్వరినిగాని పెండ్లియాడ లేదనిన్ని, తను నేటికిన్ని అవివాహితననిన్ని, వాని ఎవరో తనకు తెలియనే తెలియదనిన్ని, వాది వద్దకు తను వెళ్ళే నవసరం లేదనిన్ని ప్రతివాది జవాబు చెప్పియున్నది.

సారాంశములు : వాది ప్రతివాదులకు వివాహం అయినదా? అయినచో వాడిని ప్రతివాది అకారణంగా విడిచి పెట్టినదా? ఏ పరిహారము నకు వాది అర్హుడై యున్నాడు?

సాక్ష్యం : వాది ప్రతివాదిని అగ్నిసాక్షిగా వివాహమాడినట్లు వాది చెప్పడమే కాకుండా, చాలామంది ఆ విషయంగురించి చెప్పియున్నారు. వాది ప్రతివాదులు తనఇంట్లో కాపురం చేసినట్టు ఒక పెద్దమనిషి మిక్కిలి నిక్కచ్చిగా చెప్పియున్నాడు. పెండ్లికాలమందే కాక, గర్భాదానకాలమందుకూడా తానే పురోహితుణ్నని చెప్పేడు రెండవసాక్షి.

ప్రతివాది తన సాక్ష్యంలో తాను అవివాహితనని చెప్పియున్నది. ఆమె మిగతా సాక్షులుకూడా ఆ విధంగానే చెప్పియున్నారు. పెండ్లి జరిగిన దని వాది చెప్పేటేదీనాటికి ప్రతివాదిని ఎవరో ఉంచుకొన్నారని డిఫెన్సులో చెప్పియున్నారు. ఉంచుకున్నవారెవరో, సాక్షిగా ముందుకు రాలేదు. "పెండ్లి జరిగింది" అనే positive fac గురించి వాది తరఫున గట్టిసాక్ష్యం వచ్చియున్నది. "పెండ్లి జరుగలేదు" అనే negative tacft గురించి సరియైన సాక్ష్యంలేదు. ప్రతివాది ఏ రాత్రి ఏ గుళ్లో పెళ్ళిచేసుకుందో, చేసుకోలేదో తెలుసుకునేందుకు ఆమెని ఆమె సాక్షులు ఇరవైనాలుగ్గంటలూ అంటిపెట్టుకు తిరుగరు కదా! అదియునుగాక, లోకంలో ఇంతిమంది స్త్రీలు ఉండగా వాది ఈ ప్రతివాదినే పెళ్ళిచేసుకున్నానని ఏల చెప్పవలెను?—నిజంగా పెళ్లాడితేనే తప్ప, అన్ని విషయములనూ పరిశీలించి చూచినట్లయితే వాది ప్రతివాదులకు శాస్త్రోక్తముగా వివాహము జరిగినట్లు ఈ కేసులో బుజువయిందని కనిపిస్తూయున్నది. వాదిని విడిచి వచ్చుటకు తగినంత కారణం ప్రతివాది చూపియుండలేదు.

కాగా, వాది ప్రతివాదులకు వైవాహిక సంబంధము కలదనిన్ని, వాది ప్రతివాదిని శాస్త్రోక్తముగా వివాహమాడినాడనిన్ని డిక్లేరు చేయించుతూ, ప్రతివాది ఈ వెంటనే వానితో తిరిగి కాపురం చేయుటకు వెళ్ళవలసియున్న దని డిక్రీ జారీ చేయబడెను.

"పార్టీలు ఎవరి ఖర్చులు వారే భరించవలెను."

అదీ తీర్పు.

తీర్పు తెలుసుకున్న తర్వాత ప్రతివాది కోర్టువార్నీ, కోర్టునీ, వాదినీ, దేవుణ్ని, లోకాన్నీ బండబూతులు తిట్టింది.

కేసు అయిన తర్వాత ఫలానాఫలానా షావుకారుగారికి వాది ఒక జాబు రాసేడు.

"......కేసు పూర్తయింది. దాన్ని నేను అగ్ని సాక్షిగా పెళ్ళాడి నట్టూ, అది వచ్చి నాతో కాపరం చెయ్యాల్సినట్టూ తీర్పు చెప్పేరు. మన తడాఖాకి ఎవరాగ్గలరు. చెప్పండి. ఇహనా ముండ (!) వల్ల మీకే బాధా ఉండదు—అయితే ఇక నేను మీరు చెప్పినట్టుగా—"

వాది, అటు తరవాత ఎక్కడికి పోయాడో ఎవరికీ తెలీదు.

ప్రతివాది కేసు పర్యవసానంగురించి గోలుగోలుమని ఏడ్చింది.

ఆమెని ఉంచుకొని ఉన్నానని చెప్పడానికి ఫలానాఫలానా షావుకారుగాని, తన సమక్షాన పెళ్ళి జరగలేదని చెప్పడానికి అగ్ని భగవానుడుగాని సాక్ష్యానికి రాలేదు. వస్తే ఎంత బాగుణ్ణు ! కాని వస్తారా, మనం అనుకోడమేగాని.